క్లుప్తంగా

కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న హెల్త్‌కేర్ బృందం

జ్యోతినగర్: రాష్ట్ర భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో కార్మికులకు ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. రామగుండం కార్పొరేషన్ ఏడో డివిజన్ మల్కాపూర్ గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. భవన నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులకు సీఎస్‌సీ హెల్త్ కేర్‌బృందం సభ్యులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి కార్డులు ఉన్న వారికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. శిబిరంలో జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, భాస్కర్, హరి, హార్దిక్‌కుమార్, రమాదేవి రక్త నమూనాలు సేకరించారు. రక్తనమూనాలకు సంబంధించిన రిపోర్టులు ఆన్‌లైన్‌లో రానున్నాయని, మొబైల్ నంబర్‌కు సమాచారం రాగానే సంబంధిత నంబర్‌ను ఎంట్రీ చేయడంతో రిపోర్టులు తెలుస్తాయని పేర్కొన్నారు.

ఆర్థిక చేయూత



నగదు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పెద్దపల్లిరూరల్: మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన బాలసాని సౌజన్య పెళ్లికి లయన్స్‌క్లబ్ ఆఫ్ రంగనాయక వారి ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేగులపల్లి విజయ సహకారంతో చీర, రూ.15వేలు ఆదివారం అందజేశారు. క్లబ్ ప్రతినిధులు జైపాల్‌రెడ్డి, అశోక్‌కుమార్, శశాంత, కరుణాకర్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, తిరుపతిరెడ్డి, మధుకర్‌రెడ్డి, సంపత్, మోహన్, మురళీకృష్ణ, లక్ష్మణ్, నాగరాజు, శ్రీధర్, కోటేశ్వర్ ఉన్నారు.

షటిల్ టోర్నీ విజేతలకు బహుమతి

ఓదెల: ఓదెల గ్రామంలో సిద్ధివినాయక యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజ్ఞన్న షటిల్ టోర్నీ విజేతలకు ఆదివారం కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ బహుమతి అందజేశారు. సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలస్థాయి షటిల్ పోటీల్లో డబుల్స్‌లో గెలిచిన సుల్తానాబాద్‌కు చెందిన ఇక్బాల్, సత్యం టీమ్‌కు రూ.5వేలు, రెండో స్థానంలో నిలిచిన ఓదెలకు చెందిన రామినేని అనిల్, చక్రీ టీమ్‌కు రూ.3వేలు, సింగిల్స్ విన్నర్ సుల్తానాబాద్‌కు చెందిన అజయ్ రూ.3వేలు, రన్నర్ ఓదెలకు చెందిన అనిల్‌కుమార్‌కు రూ.2వేలు అందజేశారు. నిర్వాహకులు అనిల్, తిరుపతి, స్వామి, అజయ్, కుమార్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ఎలక్ట్రానిక్ మీడియా ఎన్నికలను శనివారం ప్రెస్‌క్లబ్ ఆడిటోరియంలో క్లబ్ అధ్యక్షుడు పూదరి కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బైరం సతీశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మామిడి సత్యనారాయణ, కోశాధికారిగా మిక్కిలి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఆవుల కృష్ణ, చందుపట్ల తిరుపతిరెడ్డి, సహాయ కార్యదర్శిగా జాన్ సుందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆకునూరి రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై అశ్విని

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉపాధిహామీ ఫీల్డ్ ఆఫీసర్ బొమ్మెన భాగ్య తన ఫోన్‌ను పోగొట్టుకోగా ధర్మారం ఎస్సై అశ్విని సీఈఐఆర్ ద్వారా గుర్తించి ఆదివారం బాధితురాలికి అప్పగించారు. 15రోజుల క్రితం భాగ్య తన సెల్‌ఫోన్‌ను గ్రామంలో పోగొట్టుకోగా మీసేవా కేంద్రంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని స్టేషన్‌లో అప్పగించారు. దొరికిన ఫోన్ ఆదివారం భాగ్యకు అప్పగించినట్లు ఎస్సై అశ్విని తెలిపారు.

ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా



లింగాపూర్ గోదావరి వద్ద అక్రమ రహదారి ఏర్పాటు



కందకం తవ్వించిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం

- ఎంత కట్టడి చేసినా.. కొత్తదారులు వెతుకుతున్న ఇసుక మాఫియా
- సాండ్ టాక్సీ కళ్లు కప్పి అర్ధరాత్రి ఇసుక తరలింపు
- గోలివాడ ఇసుక రీచ్ వేలంతోనే ప్రభుత్వానికి ఆదాయం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోదావరి నది పరివాహక గ్రామాల నుంచి సాండ్ ట్యాక్సీతో సంబంధం లేకుండా ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోంది. మండల పరిధిలోని గోలివాడ–ముర్మూర్ ఇసుక రీచ్ నుంచి సాండ్ ప్రభుత్వ అనుమతితో ట్యాక్సీ విధానం అమలవుతున్నప్పటికీ అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. జిల్లా పరిధిలో ఉన్న ఇసుక రీచ్‌లను ప్రయివేటు వ్యక్తులకు వేలం ద్వారా అప్పగించగా గోలివాడ రీచ్‌ను మాత్రం ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్నారు. దీన్ని కూడా ప్రయివేట్ వ్యక్తులకు వేలం ద్వారా అప్పగిస్తే ప్రభుత్వానికి సాండ్ ట్యాక్సీతో వచ్చే ఆదాయానికి రెట్టింపు ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందని ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రాత్రి, పగలు అక్రమ రవాణా

కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిన పిల్లర్లను పునరుద్ధరణ పనులు చేసేందుకు ఇరిగేషన్ అధికారులు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ గేట్లు తెరిచి వరద నీటిని దిగువకు వదిలారు. ఫలితంగా నది పరివాహక ప్రాంతం పూర్తిగా ఇసుకమయమైంది. కాగా గోదావరి పరివాహక గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తుండడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. గత ప్రభుత్వం సాండ్ ట్యాక్సీ పేరుతో గోలివాడ–ముర్మూర్ ఇసుక రీచ్‌ను ఎంపిక చేసినప్పటికీ నిర్దేశిత ట్రిప్పుల రవాణా, నిర్దేశిత సమయంలోగా మాత్రమే తరలించుకునే అవకాశం ఉంది. దీంతో 'గాలి వచ్చినప్పుడే తూర్పార పట్టుకోవాలే' అనే చందంగా గోదావరి నదిలో వరద నీరు లేకపోవడం అక్రమార్కులకు అనుకూలించింది. ఫలితంగా నది పరివాహక గ్రామాలైన లింగాపూర్, రాయదండి, పెద్దంపేట, ముర్మూర్, ఎల్లంపల్లి, పొట్యాల, మద్దిర్యాల, గోలివాడ గ్రామాల నుంచి అక్రమంగా పెద్ద ఎత్తున ట్రాక్టర్ల ద్వారా రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. దీనిపై స్థానిక రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం కానరావడం లేదు. దీనిపై సంబంధిత భూగర్భశాఖ స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిసారించి గోలివాడ ఇసుక రీచ్‌ను వేలం వేసే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే అక్రమ దందాకు చెక్ పడడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.

తనిఖీలు చేయండి సారూ!

- వారసంతలో బండరాళ్లు వినియోగిస్తున్న చిరు వ్యాపారులు
- చేపలు, చికెన్, మటన్ సెంటర్లలో తూకంలో మోసం
- తనిఖీలు పట్టని అధికారులు



సుల్తానాబాద్ వారసంతలో బండ రాళ్లు వేసి ఎత్తు జోకుతున్న వ్యాపారి

సుల్తానాబాద్: ఓ వినియోగదారుడు మార్కెట్‌లో కిలో టమాట కొనుగోలు చేశాడు. వాటిని ఎలక్ట్రానిక్ తూకం మిషన్‌పై తూకం వేయిస్తే 900 గ్రాములు చూపిస్తోంది. 100 గ్రాములు నష్టపోయాడు. కూరగాయల మార్కెట్‌లో ఇది నిత్యం జరుగుతోంది. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడట్లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. అధికారులు అటువైపు రాకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతున్నట్లు విమర్శలు వినవస్తున్నాయి. తూకం, కొలతల్లో తేడాలు ఉంటున్నా చిరునామా లేని చిరుతిండి, ఆహార పదార్థాల పొట్లాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

సోమవారం వారసంత

ఎలక్ట్రానిక్ కాంటా వచ్చినప్పటికీ కొందరు పాతరకపు తాసు వాడుతూ బండరాళ్లను తూకానికి ఉపయోగిస్తున్నారు. మార్కెట్‌లో కొనుగోలు చేసిన కూరగాయలను బయట ఎలక్ట్రానిక్ యంత్రంపై తూకం వేయిస్తే బరువు తక్కువగా ఉంటోంది. సోమవారం వారసంత కావడంతో సుల్తానాబాద్ మండలం, చుట్టుపక్కల (ఎలిగేడు, ఓదెల) మండలాల ప్రజలు కూరగాయలను కొనుగోలు చేస్తారు. అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేయాలని కోరుతున్నారు.

చేపలు, మటన్, చికెన్ మార్కెట్‌లో..

చేపలు, మటన్, చికెన్ మార్కెట్‌లో వినియోగదారులు ఎక్కువగా నష్టపోతున్నారు. లావుపాటి కవర్లలో చేపలు, చికెన్, మటన్ జోకడం ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు కాకుండా పాత రకపు తక్కెడ వాడుతున్నారు. బయట ఎలక్ట్రానిక్ యంత్రంపై తూకం వేయిస్తే 100 నుంచి 200 గ్రాముల వరకు తేడా వస్తున్నట్లు వినియోగదారులు చెప్తున్నారు. మరికొందరు ఎలక్ట్రానిక్ తూకం యంత్రం లీటర్ మోడ్‌లో పెట్టి తూకం వేస్తున్నారు. అందులో వెయ్యి గ్రాములు కాకుండా వెయ్యి అని మాత్రమే చూపిస్తోందని పేర్కొంటున్నారు. లీటర్ మోడ్‌లో ఉంటే పాలు తీసుకుంటే 1000 (లీటరు) ఎంఎల్ చూపిస్తుంది. కిలో చేపలు మటన్, చికెన్ తీసుకుంటే 900 అని వస్తుందని అంటున్నారు. గ్రాములా, లీటర్లా అని తెలియక వినియోగదారులు మోసపోతున్నారు.

నాణ్యతా ప్రమాణాలు గాలికి..

కిరాణ దుకాణాలు, కొన్ని సూపర్ మార్కెట్లలో ప్యాకెట్ల రూపంలో విక్రయించే వాటిపై తయారీ, నాణ్యతా ప్రమాణాలు, ఇతర వివరాలు ఉండటం లేదు. ఇష్టం వచ్చినట్లు విక్రయిస్తున్నారు. ఏదైనా వస్తువు, ఆహార పదార్థాలకు సంబంధించిన ప్యాకింగ్‌పై ఉదాహరణకు 500 కిలో గ్రాముల ప్యాక్‌పై అదనంగా 150 గ్రాములు ఇస్తున్నట్లు ముద్రిస్తున్నారు. నిశితంగా పరిశీలించి ఆఫర్ లేకపోగా ధర ఎక్కువగా ఉంటోంది. ఒకటి కొంటే మరొకటి ఉచితమంటూ బోర్డులపై ప్రదర్శిస్తూ బిల్లు మాత్రం రెండింటికి వేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

తూకంలో మోసం



కూరగాయల మార్కెట్లో బండరాళ్లు వేసి వ్యాపారులు జోకుతున్నారు. కొనుగోలు చేసిన మాకు తూకంలో మోసం జరుగుతోంది. 100 గ్రాముల వరకు తక్కువ వచ్చినా ఏం అనలేని పరిస్థితి. అధికారులు నిత్యం తనిఖీలు చేయాలి.

– రాధిక, గృహిణి, సుల్తానాబాద్

తనిఖీ చేయకపోవడంతో..



తూనికలు, కొలతల అధికారులు కూరగాయల మార్కెట్లో కాకుండా అన్ని దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలి. అన్ని దుకాణాల్లో మోసం చేస్తూ వ్యాపారంలో పబ్బం గడుపుకుంటున్నారు. అధికారులు, తనిఖీలు చేయకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నం అవుతోంది.

– కిషోర్, కాంగ్రెస్ నాయకుడు, సుల్తానాబాద్

అందుబాటులో ఉంటా.. అభివృద్ధి చేస్తా



జీపీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: అందరికీ అందుబాటు ఉంటా.. అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక నూతన గ్రామపంచాయతీ భవనం, నూతన అంగన్‌వాడీ కేంద్ర భవనాలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు మార్చి 31లోపు పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో చర్చించామని, ఆ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలను అమలు చేసి అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరనేని సాగర్‌రావు, ఎంపీపీ బాలాజీరావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఎంపీటీసీ రమేశ్, జెడ్పీటీసీ స్వరూప, బండారి రమేశ్, నాయకులు అన్నయ్య గౌడ్, ప్రకాశ్‌రావు, దమోదర్‌రావు పాల్గొన్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్: టీపీయూఎస్ జిల్లా శాఖ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి ఉపాధ్యాయ సంఘం నేతలు ఆవిష్కరించారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. నాయకులు దిలీప్, శ్రీనివాస్, కనకయ్య, జగన్, రామేశ్వర్, అంజయ్య, దాశరథరెడ్డి, సురేశ్, నరేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తా



సన్మానిస్తున్న కొమురవెల్లి భాస్కర్

సుల్తానాబాద్: ఆర్యవైశ్య సోదరులకు వ్యాపారంలో అండగా నిలుస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ ఆర్యవైశ్య భవనంలో వ్యాపారులు ఆయనను సన్మానించారు. వైశ్యులు వ్యాపారంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా.. తనదృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఆర్యవైశ్యులు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ మినుపాల స్వరూప, మున్సిపల్ వైస్‌చైర్మన్ బిరుదు సమత, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వంగల వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి అల్లంకి లింగమూర్తి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, ప్రధాన కార్యదర్శి పల్లా శ్రీనివాస్, కోశాధికారి ఎల్లంకి రాజన్న, గౌరవ అధ్యక్షులు కొమురవెల్లి రామ్మూర్తి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పల్లా అపర్ణ, రామిడి హరిని, బాదం వాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును ఆదివారం గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. పట్టణంలోని సిరి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో సంఘం నాయకులు, సభ్యులు సత్కరించారు. సంఘం నాయకులు శ్రీనివాస్, వేణు, మారుతి, పద్మ ఉన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన యువకులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. కాగా వారి కుటుంబాలను ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల చొప్పదండి మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన పడిదం హరీశ్, రాకేశ్ మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఇరువురికి చెరో రూ.5వేలు అందించారు. కాంగ్రెస్ మాజీ ఎంపీపీ కొడారి అంజన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్త నర్సింహం, మాజీ ఎంపీటీసీ గందం మహేందర్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడ్య రూప్లానాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గందం మహిపాల్ పాల్గొన్నారు.

శౌర్య దివస్‌ను ఘనంగా జరుపుకోవాలి

జ్యోతినగర్: భీమా కోరేగావ్ యుద్ధవీరుల పోరాట పటిమను గుర్తు చేసుకుంటూ 206వ శౌర్య దివస్‌ను రాష్ట్రమంతా ఘనంగా జరుపుకోవాలని సమతా సైనికదళ్ రాష్ట్ర నాయకుడు దుర్గం నగేష్ ఆదివారం పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ అంటరానితనం నుంచి విముక్తి పొందడానికి మహార్ పీడిత కులానికి చెందిన 500మంది సైనికులు 1818 జనవరి ఒకటిని బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ తరఫున రెండో బాజీరావు పీష్వా సైన్యంతో భీమానది ఒడ్డున వీరోచితంగా పోరాడి విజయం సాధించారని తెలిపారు.

అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు



అక్షింతల ఊరేగింపులో జీఎం సుధాకర్‌రావు



కల్వచర్లలో ఊరేగింపు..

రామగిరి: మండలంలోని సెంటినరీకాలనీ, పన్నూర్, కల్వచర్ల గ్రామాలకు అయోధ్య రాముని అక్షింతలు చేరాయి. ఈ సందర్భంగా వాటికి పూజలు చేసి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. సెంటినరీకాలనీ రామాలయం వరకు, కల్వచర్ల వేణుగోపాలస్వామి ఆలయాల వరకు జైశ్రీరాం అనే నినాదాలతో అక్షింతలు ఊరేగించారు. అక్షింతలను స్థానిక ఆలయాలకు తీసుకరాగా జీఎం దంపతులు అలివేణి సుధాకర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. తలంబ్రాలను ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు, మాజీ ఎంపీపీ కొరుకొప్పుల నీరజ, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, కొట్టె సందీప్, కాటం సత్యం, కొరుకొప్పుల తులసీరాం, కొలిపాక సత్తయ్య, మేకల మారుతి, దొంతుల సురేశ్, బూడిద రాజేందర్, బర్ల సత్యనారాయణ, ఒడితెల శ్రీనివాస్, కొంతం బాపు పాల్గొన్నారు.

కనుల పండువగా మెట్లపూజ



అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం



మెట్లపూజలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్ వద్ద అభయాంజనేయస్వామి ఆలయంలో మెట్లపూజ అంగరంగ వైభవంగా జరిగింది. మెట్లపూజ కార్యక్రమంలో అయ్యప్పస్వామి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పలురకాల స్వాములు నృత్యాలు చేశారు. గురుస్వాములు మిట్టపల్లి మురళి, సాయిరి మహేందర్, ముస్త్యాల రవీందర్, కుమార్ కిషోర్ పాల్గొన్నారు.

గ్యార్మీ షరీఫ్ ఊరేగింపు

రామగుండం: పట్టణంలోని ముబారక్‌నగర్ ఖాద్రీ గుల్షన్ చిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గ్యార్మీ షరీఫ్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త హజ్రత్ సయ్యదిన్ గౌస్–ఏ ఆజాం దస్తగిర్ జ్ఞాపకార్థం ప్రతీ ఏటా డిసెంబర్ చివరి వారంలో వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగానే మహారాష్ట్రకు చెందిన ఖవ్వాలి బృందం ఆలపిస్తున్న గేయాలతో పచ్చజెండాలను చేతబూని ఊరేగింపు నిర్వహించి వేడుకలను జరుపుకున్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



మంథని ప్రధాన చౌరస్తాలో..



సుల్తానాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు



సుల్తానాబాద్‌లో..


మంథని: 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ ఆనందాన్ని పంచే 2024 సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఆదివారం మంథని నియోజకవర్గ ప్రజలు ఆనందోత్సవాల్లో మునిగి తేలారు. యువకులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కేక్‌లను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బేకరీలు, స్వీటు దుకాణాలు సందడిగా మారాయి. అలాగే రంగవల్లుల ద్వారా నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు మహిళలు రంగులు కొనుగోలు చేశారు. కాగా పలువురు అధికారులు ఉన్నతాధికారులకు పుష్పగుచ్ఛం ఇచ్చి పాత సంవత్సరానికి వీడ్కోలు తెలిపి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలు, కళాశాలల్లో సంబరాలు

సుల్తానాబాద్: పట్టణంలో పలు పాఠశాలలు, కళాశాలల్లో 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికారు. చేదు జ్ఞాపకాలను వదిలేసి మంచి జ్ఞాపకాలను నెమరు వేసుకోవాలని ఇండియన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సంజీవ్ కుమార్ సూచించారు. 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేశారు.

కాల్వశ్రీరాంపూర్: న్యూఇయర్ వేడుకల సందర్భంగా బేకరీల్లో కేక్‌లకు గిరాకీ పెరిగింది. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో బేకరీలు, స్వీటు హౌస్‌లు సందడిగా మారాయి.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి: తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. తెలుగు ఇస్లామిక్ పబ్లిక్ ట్రస్ట్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ ఖాజీ మహ్మద్ ఇస్మాయిల్ నిజామీ, అహ్మద్ పాషా, అబ్దుల్ రజాక్, బాషు మియాన్, జైనులాబుద్దీన్, మతీన్ పాల్గొన్నారు.